క్లుప్తంగా

నేడు వాసవీ మాత జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో బుధవారం వాసవీ మాత జయంతి వేడుక ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని విశేష పూజలు, అమ్మవారి మహాప్రాకార ప్రదక్షిణం, గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలు, పూర్ణాహుతి, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సహస్ర నామ కుంకుమ అర్చన చేయనున్నారు. సాయంత్రం 7 గంటలకు 102 మంది ఆర్యవైశ్య సుహాసినులతో లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి విశేషంగా వజ్రపు చీర, కిరీట ధారణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని రామమోహన్‌రావు కోరారు.

ఉద్యోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

బద్వేలు అర్బన్ : ఎండలు పెరిగిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిపో మేనేజర్ ఆర్‌సీ.నిరంజన్ పేర్కొన్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు డిపో ఆవరణంలో మంగళవారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులకు ఆయన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో డీ హైడ్రేషన్, వడదెబ్బకు గురికాకుండా సరిపడా నీరు తీసుకోవడంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలుపుకొని తాగాలని సూచించారు. వేసవికాలం ముగిసేంత వరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, బాబు, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ప్రొద్దుటూరు క్రైం: మండలంలోని కానపల్లెలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని ఉమ్మనబోయిన బాలపుల్లయ్య పశు గ్రాసం నిమిత్తం రెండు గడ్డివాములు వేశారు. ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని రెండు వాములు పూర్తిగా కాలిపోయాయి. ప్రొద్దుటూరు అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మిగతా వాములకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. రెండు వాములకు నిప్పంటుకుని సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు పుల్లయ్య తెలిపారు.

సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం తగదని సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, కోశాధికారి కె.శివకుమార్ పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా హామీలు అమలుచేయలేదన్నారు. జీవోలు జారీ చేయకపోగా ప్రస్తుతం ఉన్న ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. మున్సిపాలిటీలో చెత్త తరలించే వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించడంతో పాటు పూర్తిస్థాయిలో బీమా చేయించి వాహనాలపై పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యామ్ ప్రవీణ్, ఉపాధ్యక్షురాలు దేవమ్మ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, కార్యదర్శులు సత్యరాజు, ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రామయ్య, వరప్రసాద్ పాల్గొన్నారు.


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

20 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు సమ్మె చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఇంజినీరింగ్ సెక్షన్, కోవిడ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. కార్మికుల వయో పరిమితి 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ యూనియర్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ విజయ్‌కుమార్, కోశాధికారి రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు గుర్రమ్మ, నీతమ్మ, అన్నపూర్ణ, శాంతి జాకోబు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సింహ వాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం రాత్రి గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని సింహ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి అలంకరించారు. గణపతిపూజ, కలశపూజ, మండపారాధన, దీక్షా హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నటరాజ కళా క్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల భక్తి గీతాలకు చేసిన కూచిపూడి, శాస్త్రీయ నృత్యాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులను సింహ వాహనంపై శివ నామ స్మరణ మధ్య పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తమిద్దె రఘురామిరెడ్డి, రామచంద్రాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


సింహవాహనంపై అగస్త్యేశ్వరుడు

బీజేపీ విధానాలతో దేశ సమైక్యతకు ముప్పు

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ విధానాలతో దేశ సమైఖ్యత, సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థలను తమ అధీనంలోకి తీసుకుని ప్రతిపక్ష పార్టీలు, తిరగబడిన మిత్రపక్షాలపై ప్రయోగిస్తోందన్నారు. వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి మానసికంగా లొంగతీసుకోవడం అప్రజాస్వామికమైన చర్య అన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ రాజధానికి నిధులు ఇవ్వకపోయినా, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మించకపోయినా, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకపోయినా, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా ప్రశ్నించలేని పరిస్థితుల్లో టీడీపీ, జనసేన పార్టీలున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, చాంద్‌బాషా, చిన్ని, మోక్షమ్మ, ఖైరున్‌బీ, బాబు, శివ, అనంతమ్మ, ప్రసాద్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

బద్వేలు అర్బన్ : ఎండ తీవ్రత ఎక్కువవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయమని జెడ్పీ చైర్మన్ ముత్యాలరామగోవిందరెడ్డి అన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్బీఐ సమీపంలో రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే గ్రామీణులకు, పేదలకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పట్టణంలో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌ను రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, ఎంపీపీ బోడపాడు రామసుబ్బారెడ్డి, బి.మఠం సింగిల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, నాయకులు యద్దారెడ్డి, వెంకటరామిరెడ్డి, రెడ్డి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగసాని సాంబశివారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చవ్వావెంకటరామారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న రెడ్డిసేవా సంఘం నాయకులు

బస్టాండులో పోలీసుల తనిఖీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, పోలీసులకు తెలపాలని కంట్రోలర్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయించారు.

రాధాకృష్ణవేణి సేవలు ప్రశంసనీయం

చాపాడు : ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి సేవలు ప్రశంసనీయమని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై వేములకు వెళ్లిన రాధాకృష్ణవేణికి ఆయనతోపాటు, ఎంపీడీఓ వీరకిషోర్, తోటి సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఈఓపీఆర్డీగా కృష్ణవేణి ఉత్తమ సేవలదించారన్నారు. అనంతరం ఈఓపీఆర్డీని ఘనంగా సన్మానించారు. తహసీల్దారు రమాకుమారి, రామానుజం, మ్యాగీ, రవిశంకర్, వంశీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.


రాధాకృష్ణవేణిని సన్మానిస్తున్న ఎంపీపీ, సిబ్బంది

మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీవాణిని మంగళవారం వినతిపత్రం అందజేశారు. అయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో 70 మంది పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్నారని, వారికి వేతనాలు ఇవ్వకపోగా, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని చెప్పారు. 10వతేదీలోగా జీతాలు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామన్నారు. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, రాఘవేంద్ర, జిల్లా హాస్పిటల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రత్నమ్మ, కళావతి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రొద్దుటూరు గ్రంథాలయంలో విద్యార్థులకు శక్తి టీం సభ్యురాలు శివకుమారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు వారి చట్టాలు, శక్తి ఆప్ ద్వారా విద్యార్థులు తమకు తాము ఏ విధంగా సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవాలో ఆమె వివరించారు. 100, 1098, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

బ్రహ్మంగారి సన్నిధిలో జెడ్పీ చైర్మన్

బ్రహ్మంగారిమఠం : వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురు పూజ మహోత్సవాల్లో భాగంగా జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మంగళవారం స్వామిని దర్శించుకున్నారు. స్థానిక దేవస్థానం నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం బి.మఠం దేవస్థానం పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మఠం మనేజర్ ఈశ్వరాచారి జడ్పీ చైర్మన్‌కు ఉత్సవాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొగ్గుల సుబ్బారెడ్డి, నేలటూరు వెంకటరామిరెడ్డి, పాలరామిరెడ్డి, దుగ్గిరెడ్డి, పసుపులేటి రామయ్య, సుబ్బరాజు, ఎత్తపు సుబ్బారెడ్డి, నాగార్జుననాయుడు, యోగి వేమారెడ్డి పెద్దిరెడ్డి గంగిరెడ్డి, ఎత్తపు సుదర్శన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మంగారి సన్నిధిలో జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు


స్వామి, అమ్మవారి ఊరేగింపు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని జగద్గురు శ్రీ మదివ్రాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. స్వామి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. ఆలయానికి రంగులతో మెరుగులద్దారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. దేవాలయంతోపాటు పరిసర ప్రాంతాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ప్రాంగణంలో శోభాయమానంగా రంగవళ్లులు వేశారు. ఆకట్టుకునేలా ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు వేసి, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.


ఇరుముడి సమర్పిస్తున్న మాలధారులు


హరికథ కళాకారుడు పాలరామాంజనేయులును సత్కరిస్తున్న శంకర్‌బాలాజి

నేడు ప్రధాన వేడుకలు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 9 వరకు నిర్వహించనున్నారు. బుధవారం స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన రోజు కావడంతో ప్రధాన వేడుకలు నిర్వహిస్తారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి సజీవ సమాధిని దర్శించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ పర్యవేక్షణలో మఠం మేనేజర్ ఈశ్వరాచారి ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. స్వామి సజీవ సమాధి నిష్ట అనంతరం భక్తులు 332 ఏళ్ల క్రితం నుంచి కందిమలాయపల్లె పురవీధుల్లో రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం జరిగే వీరబ్రహ్మేంద్ర, గోవింద మాంబల బ్రహ్మ రథోత్సవాన్ని తిలకించేందుకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

మఠం.. ఉత్సవ శోభితం

• ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు • నేడు స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర దినం


విద్యుద్దీపాలంకరణలో బ్రహ్మంగారిమఠం

దర్శనీయ స్థలాల వద్ద భక్తుల సందడి

ఉత్సవాల సందర్భంగా బ్రహ్మంగారిమఠంలోని దర్శనీయ స్థలాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి నివసించిన గృహం, శ్రీ ఈశ్వరీదేవిమఠం, పోలేరమ్మగుడి, కక్కయ్య మఠం, అచలానందస్వామి ఆశ్రమం, రామాలయం, వీరబ్రహ్మేంద్రాశ్రమం, పోలేరమ్మచే నిప్పు తెప్పించిన రచ్చబండ, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, ముడుమాలలోని సిద్దయ్యమఠం, అక్కంపేటలోని విభూతి నాగలింగేశ్వరస్వామి దేవస్థానం, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌ను భక్తులు సందర్శించారు.

ఈశ్వరీదేవిమఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురు పూజ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. కార్యక్రమాలకు ముత్తలూరు ఆంజనేయశర్మ, రఘువు వెంకటాసుబ్రమణ్యాచార్యులు ఆధ్వర్యం వహించారు. ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.